విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలి


అవగాహన సదస్సులో పాల్గొన్న సమాఖ్య ప్రతినిధులు

సైదాబాద్: రాష్ట్రంలోని బాలబాలికల ఉజ్వల భవిష్యత్ కోసం తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు బడ్జెట్‌లో 15 శాతం నిధులు విద్యకు కేటాయించాలని తెలంగాణ ఆడపిల్లల సమానత్వ సమాఖ్య సైదాబాద్ మండల కమిటీ కన్వీనర్ బి.పుష్పలత డిమాండ్ చేశారు. బుధవారం ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి కాలనీ కమ్యూనిటీ హాల్లో సమాఖ్య ఆధ్వర్యంలో బాలికలకు హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సమాఖ్య కన్వీనర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే బాలబాలికలకు ప్రభుత్వం ఉచిత రవాణా ఏర్పాటు చేయాలన్నారు. విద్యాహక్కును 18 సంవత్సరాల బాలబాలికలకు విస్తరిస్తూ ప్రభుత్వం చట్టం చేయాలని కోరారు. సదస్సులో సమాఖ్య ప్రతినిధులు ప్రవీణ, లావణ్య, భవానీ, కావ్యశ్రీ, సౌమ్య, కీర్తన, నిర్మల, సంగీత, ఎంవీ ఫౌండేషన్ సభ్యులు సంతోషి, సాయిలక్ష్మి, అలివేలు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందుల్లేకుండా రోడ్డు పనులు చేపట్టాలి

చైతన్యపురి: ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహాగుప్తా అన్నారు. విద్యుత్‌నగర్, గణేష్‌పురి కాలనీలో రూ. 87 లక్షలతో రోడ్ల పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో బుధవారం ఆయన కాలనీల్లో పర్యటించారు. నూతన రోడ్డు వేసే ముందే డ్రైనేజీ, తాగునీటి కనెక్షన్‌లను తీసుకోవాలని, పూర్తయిన తర్వాత తవ్వకాలు చేపట్టకుండా చూడాలని జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రత్నసాయికి సూచించారు. ఈ కార్యక్రమంలో రామచారి, శ్రీనివాసచారి, రమేష్ ముదిరాజ్, యోగి, వినోద్‌యాదవ్, వెంకన్న, నవీన్‌యాదవ్, నరేందర్‌రెడ్డి, అంజిబాబు పాల్గొన్నారు.


కాలనీవాసులతో మాట్లాడుతున్న రంగా నర్సింహాగుప్తా

ఎల్‌బీనగర్ చౌరస్తాలో లక్ష్మణ్ బాపూజీ విగ్రహం ఏర్పాటు చేస్తాం


కరపత్రాలను విడుదల చేస్తున్న చిరంజీవులు

లింగోజిగూడ: ఎల్‌బీనగర్ చౌరస్తాలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని మాజీ ఐఏఎస్ అధికారి చిరంజీవులు తెలిపారు. కొత్తపేట చౌరస్తాలో బుధవారం తెలంగాణ బీసీ కులాల సమన్వయ వేదిక అధ్యక్షులు బొమ్మ రఘురామ్ నేత ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మగౌరవ సభలో ఆయన పాల్గొని కాంస్య విగ్రహ ఏర్పాటుపై కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ తొలి దశ ఉద్యమంలో మంత్రి పదవికి రాజీనామా చేసి ఉద్యమంలో బాపూజీ పాల్గొన్నారని గుర్తు చేశారు. బీసీలంత ఏకతాటిపైకి వచ్చి రాజ్యాధికారం చేపట్టాలని బాపూజీ కల అన్నారు.

దశలవారీగా సమస్యలకు పరిష్కారం


కాలనీవాసులతో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

హయత్‌నగర్: డివిజన్‌లోని విద్యానగర్ కాలనీ సమస్యలను పరిష్కస్తానని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి అన్నారు. మార్నింగ్ వాక్‌లో భాగంగా బుధవారం ఆయన కాలనీలో పర్యటించారు. కాలనీలో మట్టిరోడ్ల కారణంగా దుమ్మూ, ధూళి ఎగిసి పడుతుందని, విద్యుత్ దీపాలు లేక రాత్రి సమయంలో ఇబ్బందులకు గురవుతున్నామని కాలనీ వాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకు రాగా దశలవారీగా సమస్యలన్నీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్పొరేటర్ వెంట సత్తయ్య, రామారావు, పోతులూరి, కృష్ణ, భిక్షపతి, మార్కండేయులు, ముత్యాలు, నాగరాజు ఉన్నారు.

మళ్లీ ఇళ్ల కూల్చివేత

చాదర్‌ఘాట్: అజంపురా డివిజన్‌లో మూసీ సుందరీకరణలో భాగంగా నాలుగు నెలల క్రితం పాక్షికంగా ఇళ్లు కూల్చివేసిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా బుధవారం మూసానగర్, శంకర్‌నగర్‌లో పూర్తిస్థాయిలో కూల్చివేశారు. బాధితులకు గతంలోనే చంచల్‌గూడలో డబుల్ బెడ్రూమ్‌లు కేటాయించారు. చాదర్‌ఘాట్, శంకర్‌నగర్ మూసానగర్ మూసీ ప్రాంతాల్లో ఇళ్లు ఖాళీ చేసిన వాటిని కూల్చి ప్రహరీ నిర్మిస్తున్నారని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే బలాల అన్నారు. బాధితులకు ప్రభుత్వం తరఫున రావాల్సిన ఆర్థిక సాయం, డబుల్ బెడ్రూమ్‌లు అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.


మూసానగర్‌లో ఇళ్లు కూల్చివేస్తున్న దృశ్యం

అవగాహనతో కుష్టు నిర్మూలన

హుడాకాంప్లెక్స్: సరైన అవగాహన ద్వారా కుష్టు వ్యాధిని నిర్మూలించవచ్చని పారామెడికల్ రిటైర్డ్ ఆఫీసర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు పురుషోత్తంరావు అన్నారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన పక్షోత్సవాల సందర్భంగా బుధవారం లయోల పాఠశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సరూర్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు పురుషోత్తంరావు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు పక్షోత్సవాలు కొనసాగుతాయని తెలిపారు. విద్యార్థులకు, మహిళా మండలి, యువజన సంఘాల వారికి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సద్గుణాచారి, కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ చంద్రయ్య, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రఘు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా అంతర్గత రోడ్లు


గుంతలమయంగా మన్సూరాబాద్ సెంట్రల్ బ్యాంక్ కాలనీ రోడ్డు


బీఎన్‌రెడ్డినగర్, వైదేహినగర్‌లో.. ఉత్తుత్తి హామీలే..

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని పలు కాలనీల రోడ్లు అధ్వానంగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ధ్వంసమైన రోడ్లకు మరమ్మతు చేయాలని పలుమార్లు సంబంధిత అధికారులతో మొర పెట్టుకున్నా పట్టించుకునే నాథుడే లేడని ఆయా కాలనీలవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుంతలమయమైన రోడ్లతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనదారులు వాపోతున్నారు. అధికారులు తమ కమీషన్‌ల కోసం వేసిన రోడ్లనే మళ్లీ మళ్లీ వేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బాగున్న రోడ్లను అభివృద్ధి పనుల పేరుతో ఏడాదికి రెండు సార్లు తవ్వి వేస్తున్నారని కానీ అంతర్గత రోడ్లను పట్టించుకోక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ధ్వంసమైన రోడ్లపై వెళ్లలేని దుస్థితి నెలకొందని వెంటనే నిధులు మంజూరు చేసి నూతన రోడ్లను వేయాలని ప్రజలు కోరుతున్నారు.పలు రోడ్లు కనీసం నడవలేని పరిస్థితి ఉందని వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. అలాగే పలు చోట్ల స్థానికులు పైప్‌లైన్ల కోసం తవ్వి వదిలేస్తున్నారని కనీసం మరమ్మతు చేయకపోవడంతో గుంతలమయంగా మారుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో ప్రతి కాలనీల్లోని రోడ్లన్నీ చిత్తడిగా మారుతుంటాయని వాపోతున్నారు. గతంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించి మరమ్మతు చేపడుతామని హామీలిచ్చి ఇప్పటి వరకు ఆ దిశగా ఎలాంటి పనులు చేపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అర్ధంతరంగా ఎల్‌బీనగర్–నాగోలు మోడల్ సైకిల్ ట్రాక్ కారిడార్ పనులు

ఆరంభ శూరత్వం.. ఆపై అలసత్వం

- పార్కింగ్ అడ్డాగా మారిన వైనం
- పునఃప్రారంభించాలంటున్న స్థానికులు
- విస్మరిస్తున్న అధికారులు



ఎల్‌బీనగర్ శివగంగ కాలనీ వద్ద మోడల్ సైకిల్ ట్రాక్ కారిడార్‌లో పార్కింగ్ చేసిన వాహనాలు

నాగోలు: నాగోలు మూసీ నుంచి ఎల్‌బీనగర్ వరకు చేపట్టిన మోడల్ సైకిల్ ట్రాక్ కారిడార్ పనులను మధ్యలోనే వదిలివేయడంతో అక్రమ పార్కింగ్‌కు అడ్డాగా మారుతున్నాయి. గతంలో నాగోలు నుంచి ఎల్‌బీనగర్ వరకు రోడ్డు మార్గం రూపురేఖలు మారిపోతాయని ఈ మార్గానికి రెండు వైపులా పచ్చని చెట్లతో పాటు వాకింగ్, సైకిల్ ట్రాక్‌ను ఏర్పాటు చేస్తామని జీహెచ్‌ఎంసీ అధికారులు తెలిపారు. ఇదే కాకుండా సర్వీసు రోడ్డును సైతం అందుబాటులో తెస్తామని పేర్కొన్నారు. విదేశాలను తలపించేలా సైకిల్ ట్రాక్ మోడల్ కారిడార్‌ను ఆధునికీకరిస్తామని చెప్పి రెండేళ్ల క్రితం చేపట్టిన మోడల్ కారిడార్ పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. ఇప్పటికీ సగం పనులు కూడా పూర్తి కాలేదు. పనుల తీరును చూస్తుంటే మరో ఏడాది పట్టేలా ఉంది. గతంలో ఎల్‌బీనగర్ జోన్‌లో మొదటగా మోడల్ కారిడార్‌ను ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. కానీ పనులు మధ్యలో ఆగిపోవడంతో ఆరంభ శూరత్వం అన్నట్లు ఆదిలోనే ఆగిపోయాయి.

పార్కింగ్‌కు అడ్డాగా..

ఎల్‌బీనగర్ నుంచి నాగోలు బ్రిడ్జి వరకు నిర్మించిన సైకిల్ ట్రాక్, మోడల్ కారిడార్ పూర్తిగా పార్కింగ్ అడ్డాగా మారిపోయింది. రహదారి వెంబడి ఉన్న దుకాణదారులు పూర్తిగా వారి ఆధీనంలోకి తీసుకుని పార్కింగ్ అడ్డాగా మార్చుకున్నారు. ఎల్‌బీనగర్ నుంచి ఉప్పల్ మార్గానికి ఇరువైపులా 6 అడుగుల వెడల్పులో సైకిల్ ట్రాక్, 10 అడుగుల వెడల్పులో పాదచారులకు ఫుట్‌పాత్, 4 అడుగుల వెడల్పులో గ్రీనరీ, మరో 10 అడుగుల వెడల్పుతో సర్వీసు రోడ్డును ఏర్పాటు చేశారు.


ఎల్‌బీనగర్‌లో మోడల్ సైకిల్ ట్రాక్ కారిడార్‌లో ఇసుక, కంకర ఇలా..


నాగోలులో కార్ల పార్కింగ్

బిల్లులు రాకపోవడంతోనే..

పచ్చదనం కోసం పెద్ద ఎత్తున్న మొక్కలు నాటుతామని చెప్పిన అధికారులు ఇంత వరకు మొక్కలే నాటలేదు. జీహెచ్‌ఎంసీ నుంచి అధికారులు పెద్ద ఎత్తున నిధులు కేటాయించి మోడల్ కారిడార్ పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు సరైన సమయంలో బిల్లు రాకపోవడంతో మధ్యలోనే ఆపేశారు. ఈ విషయంపై జీహెచ్‌ఎంసీ అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో కోట్లాది రూపాయలు పెట్టి నిర్మించిన మోడల్ కారిడార్ ప్రజలకు అందుబాటులో లేకుండా పోయింది. ఉన్నతాధికారులు స్పందించి ఆగిపోయిన పనులను పునఃప్రారంభించి మోడల్ కారిడార్‌ను వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

అక్రమంగా గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తున్న వ్యక్తి అరెస్ట్

సైదాబాద్: గృహ వినియోగాలకు సరఫరా చేసే గ్యాస్ సిలిండర్ నుంచి అక్రమంగా ఆటోలకు రీఫిల్లింగ్ చేస్తున్న వ్యక్తిని సైదాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. సైదాబాద్ ఖాజాబాగ్‌లో నివసించే ఆటోడ్రైవర్ ముడావత్ రతన్ (45) తన ఇంటి వద్ద ఆటోలకు గ్యాస్ సిలిండర్ల నుంచి అక్రమంగా ప్రమాదకర రీతిలో రీఫిల్లింగ్ చేస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అతడి ఇంటిపై దాడి చేసి గ్యాస్ సిలిండర్, రీఫిల్లింగ్ మిషన్, ఒక ఆటో సహా అతడిని అదుపులోకి తీసుకున్నారు.

ఓలేటి భాస్కరరావు మృతి


భాస్కరరావు(ఫైల్)

చంపాపేట: చంపాపేట డివిజన్ రాఘవేంద్ర కాలనీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ ఉద్యోగి, నాన్ టీచింగ్ అసోసియేషన్ క్రియాశీలక సభ్యులు ఓలేటి భాస్కరరావు బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది హాజరై భాస్కరావు భౌతికకాయానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ డీఎస్‌ఏ వేణుగోపాల్‌రెడ్డి, ఈఈఐ జగన్మోహన్‌రెడ్డి, పీఏఐఓ సునిత, డిప్యూటీ రిజిస్ట్రార్ మహేశ్వర్, విశ్రాంత ప్రొఫెసర్స్ రత్నాకర్, లోకారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సూర్యామణి, శైలజ, నాన్ టీచింగ్ అసోసియేషన్ కార్యదర్శి అమృతారెడ్డి, స్థానిక కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ పాల్గొన్నారు.

దావత్ ఇస్తా రమ్మంటూ దోపిడీ

సైదాబాద్: బర్త్‌డే దావత్ ఇస్తా రమ్మంటూ పిలిచిన అపరిచితుడిని నమ్మి వెళ్తే, అతను మద్యం తాగించి సెల్‌ఫోన్, బంగారు ఉంగరం దోచుకెళ్లిన ఘటన సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సైదాబాద్ ఎల్‌సీహెచ్ కాలనీలో నివసించే గోవర్ధనాచారి ఈనెల 9న తన ద్విచక్ర వాహనం రిపేరు కోసం భారత్ గార్డెన్ ఎదురుగా ఉన్న మెకానిక్ షాపునకు వెళ్లి మెకానిక్ కోసం వేచి చూస్తున్నాడు. అక్కడికి వచ్చిన యువకుడు గోవర్ధనాచారితో మాటలు కలిపాడు. తమ చుట్టాల అబ్బాయి అనుకొని ఇతను కూడా మాట్లాడాడు. అపరిచిత యువకుడు ఈ రోజు నా పుట్టిన రోజు దావత్ ఇస్తా రమ్మంటూ తన బైక్‌పైనే గోవర్ధన్‌ను సమీపంలోని దుకాణానికి తీసుకెళ్లి మద్యం కొనుగోలు చేసి ఇరువురు సేవించారు. అయితే మద్యం సేవించిన తర్వాత యువకుడు బర్త్‌డే దావత్ కూడా ఇచ్చాను నాకు గిఫ్ట్ ఇవ్వవా మామా అంటూ బలవంతంగా గోవర్ధన్‌పై దాడి చేసి అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్, చేతికి ఉన్న అర తులం బంగారు ఉంగరాన్ని లాక్కొని అక్కడి నుంచి ఉడాయించాడు. అపరిచితుడితో పెనుగాలటలో గాయాలైన గోవర్ధన్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. మంగళవారం బాధితుడి ఫిర్యాదుతో సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గత పాలకుల అండదండలతో చెరువులు, నాలాల కబ్జా


జెడ్సీ హేమంత్ కేశవ్‌పాటిల్‌తో సమస్యలపై చర్చిస్తున్న మధుయాష్కీగౌడ్

మన్సూరాబాద్: గత పదేళ్ల నుంచి రాజకీయ నేతల అండదండలతో కొందరు ఎల్‌బీనగర్‌లోని చెరువులు, కుంటలు, నాలాలను కబ్జా చేశారని, హైడ్రాకు ఫిర్యాదు చేసి వాటిని తొలగిస్తామని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ అన్నారు. ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌తో కలిసి బుధవారం ఆయన చంపాపేట, హస్తినాపురం డివిజన్లతో పాటు మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్‌లో పర్యటించి నిలిచిపోయిన ట్రంక్‌లైన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలాలు, చెరువుల ఆక్రమణకు హస్తినాపురంలోని చేపల చెరువు నిదర్శనంగా ఉందన్నారు. ఈ చెరువు ప్రాంతమంతా ఆక్రమణకు గురైందని ఓ ఫంక్షన్ హాల్‌కు చెందిన వ్యక్తులు నాలాను ఆక్రమించి పార్కింగ్‌ను ఏర్పాటు చేశారని స్థానికుల ఫిర్యాదు మేరకు ఆక్రమణలు తొలగించేలా చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట జితేందర్, భాస్కర్‌యాదవ్, వేణుగోపాల్‌యాదవ్, నల్ల రఘుమారెడ్డి, భీమిడి రామకృష్ణారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మెరుగు రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎనలేనివి


కార్మికులకు దుస్తులు పంపిణీ చేసిన అరుణరవీందర్‌రెడ్డి

సైదాబాద్: విపత్కర సమయాల్లో సహా అన్నివేళల్లో ప్రజాహితం కోసం పారిశుద్ధ్య కార్మికులు చేసే సేవలు ఎనలేనివని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని జీఏ–2 కాలనీలోని శ్రీనివాసరెడ్డి కమ్యూనిటీహాల్లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికులు సక్రమంగా తమ విధులు నిర్వహిస్తున్నందునే పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉంటున్నాయన్నారు. మెరుగైన పరిశుభ్ర వాతావరణం కోసం కాలనీలు, బస్తీలవాసులు పారిశుద్ధ్య కార్మికులకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు కృష్ణమురళి, రాజేశ్వరరావు, సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించకపోవడంతో మూన్నాళ్ల ముచ్చటగా మారుతున్నాయి. మూడు నెలలక్రితం మూసారంబాగ్ డివిజన్ రత్నంబస్తీలైన్‌లో నాలాపై ఉన్న క్యాచ్‌పిట్‌లు పూర్తిగా పాడైపోయాయి. నిర్మాణం తర్వాత క్యూరింగ్ చేయకపోవడంతో నిర్మించిన వారం రోజులకే క్యాచ్‌పిట్‌లు కుంగిపోతున్నాయి. ప్రమాదాలు చోటు చేసుకోకుండా స్థానికులే దాని చుట్టూ రాళ్లు, కట్టెలు అడ్డంగా పెట్టుకున్నారు. –మలక్‌పేట



విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి


క్రీడాకారులకు టీషర్టులు అందజేస్తున్న నర్సింహారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి సూచించారు. కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి హర్షలత ఆధ్వర్యంలో ఆర్‌కేపురంలో నిర్వహించిన తెలంగాణ ఇంటర్ స్కూల్ స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్ పోటీలను బుధవారం నర్సింహారెడ్డి ప్రారంభించి క్రీడాకారులకు టీషర్టులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందన్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లోనూ సత్తాచాటాలని పిలుపునిచ్చారు.

రంగరాజన్‌కు పరామర్శ



దిల్‌సుఖ్‌నగర్: చిలుకూరు బాలాజీ దేవస్థానం ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై దాడి విషయం తెలుసుకున్న ఆర్‌కేపురంలోని శ్రీశైవక్షేత్ర పీఠాధిపతి శ్రీశివ స్వామిజీ, రుద్రయోగి స్వామిజీ, బాబా పాండురంగ గురూజీ బుధవారం వెళ్లి పరామర్శించారు. వారు మాట్లాడుతూ.. దాడి చేసిన వారిని శిక్షించాలని ఇలాంటి ఘటనలు మరోసారి జరగకుండా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలన్నారు. హైమ, కోటేశ్వరరావు, శ్రీనివాస్, శ్రీదేవీ, వనిత, దేవిక పరామర్శించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


పూజల్లో పాల్గొన్న దేప సురేఖా భాస్కర్‌రెడ్డి దంపతులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ అల్కాపురిలోని శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవాలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. పౌర్ణమి సందర్భంగా ఆలయంలో శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జీహెచ్‌ఎంసీ మాజీ ఫ్లోర్‌లీడర్ దేప సురేఖా భాస్కర్‌రెడ్డి దంపతులు వార్షికోత్సవానికి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ క్రొవ్విడి వెంకట శ్రీనివాస్, అర్చకులు హరిహర శర్మ, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆనంద్‌కుమార్ అంత్యక్రియలు



చైతన్యపురి: కుంభమేళాకు వెళ్లి వస్తూ మధ్యప్రదేశ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన గోల్కొండ ఆనంద్‌కుమార్ పార్థివదేహం బుధవారం సాయంత్రం గడ్డిఅన్నారం డివిజన్ వీవీనగర్‌కు తీసుకొచ్చారు. ఆనంద్‌కుమార్ ముసారంబాగ్‌లో నివసిస్తున్నప్పటికి సొంత గృహం, సోదరులు శేఖర్, మధుకర్ వీవీనగర్‌లో ఉండటంతో ఆయన మృతదేహాన్ని ఇక్కడకు తీసుకొచ్చారు. స్థానిక కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి, బీజేపీ అధ్యక్షుడు జయప్రకాష్, విశ్వ బ్రాహ్మణ స్వర్ణకార సంఘం మాజీ అధ్యక్షుడు పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అనంతరం అంబర్‌పేట శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

ఇల్లు అమ్మకపోతే చంపేస్తా..

- బాధితుడి ఇంటిపై దాడి చేసి హెచ్చరించిన నయీం అనుచరుడు
- సైదాబాద్ పీఎస్‌లో ఇరు కుటుంబాల ఫిర్యాదు

సైదాబాద్: ఇల్లు నాకు అమ్మేసి ఖాళీ చేయకపోతే చంపేస్తానంటూ నయీం అనుచరుడు తన ఇంటిపై దాడి చేశాడని బాధితుడు సైదాబాద్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. అయితే అతనే తన కుటుంబ సభ్యులను కులం పేరుతో దూషించాడని నయీం అనుచరుడి కుమారుడు పోలీసులను ఆశ్రయించాడు. ఇరు కుటుంబాల ఫిర్యాదులపై దర్యాప్తు చేస్తున్నామని సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ తెలిపారు. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సైదాబాద్ కరణ్‌బాగ్‌లోని లక్ష్మీ అపార్ట్‌మెంట్‌లో మిర్చి వ్యాపారి ప్రకాష్ కుటుంబంతో జీవిస్తున్నాడు. అదే అపార్ట్‌మెంట్‌లో నయీం అనుచరుడు శ్రీహరి ఉంటున్నాడు. అయితే రెండేళ్లుగా తన ఫ్లాట్‌ను అమ్మమని శ్రీహరి బెదిరింపులకు పాల్పడుతున్నాడని ప్రకాష్ తెలిపారు. ఈ క్రమంలోనే గత ఆదివారం శ్రీహరి తన కుటుంబ సభ్యులతో కలిసి తమ ఇంటిపై దాడి చేసి గాయపరచాడని ప్రకాష్ భార్య అనురాధ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ప్రకాష్ కుటుంబ సభ్యులే తమను పలు సార్లు కులం పేరుతో దూషిస్తూ హేళన చేస్తున్నారని శ్రీహరి కుమారుడు రాజేంద్ర ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇరువురి ఫిర్యాదులపై దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

రోడ్డు ప్రమాద మృతులకు నివాళి

చైతన్యపురి: మధ్యప్రదేశ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలోని మృతులకు బుధవారం దిల్‌సుఖ్‌నగర్ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. మధురాపురి కాలనీలోని స్వర్ణకార వీధిలో సంతాపంగా మార్కెట్ బంద్ పాటించారు. కుంభమేళా వెళ్లివస్తుండగా స్వర్ణకార వృత్తిదారులు మృతి చెందటం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రాచకొండ శ్రీనివాస్, కీర్తిగారి అనంతాచారి, లవకుమార్, వెంకటాచారి, వెంకటరమణ, గోవర్ధనాచారి, రవిచారి పాల్గొన్నారు.